క్లుప్తంగా

'కలమడుగును మండలం చేయాలి'

జన్నారం: అన్ని సౌకర్యాలున్న కలమడుగు గ్రామాన్ని మండలంగా ఏర్పాటు చేయాలని ఉప సర్పంచ్ రాజగౌడ్, వివిధ పార్టీల నాయకులు బొంతల మల్లేశ్, విష్ణుమూర్తి, రాజరావ్, దయాకర్ డిమాండ్ చేశారు. శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ నైజాం కాలంలో కలమడుగులోనే పోలీస్‌స్టేషన్, ప్రభుత్వ కార్యాలయాలు ఉండేవన్నారు. పరిసర ప్రాంత గ్రామ పంచాయతీల ప్రజలకు జన్నారం వెళ్లి రావడం ఇబ్బందిగా మారిందన్నారు. సమావేశంలో గ్రామస్తులు శ్రీకాంత్, సురేశ్, రమేశ్, నీలయ్య, తదితరులు పాల్గొన్నారు.

పెండ్లిమడుగులో నిల్వ నీరు తొలగింపు


నిల్వనీటిని తొలగిస్తున్న జీపీ సిబ్బంది

సాక్షి ఎఫెక్ట్..

దండేపల్లి: మండలంలోని కర్ణపేట పంచాయతీ పరిధిలోని పెండ్లిమడుగులో ఇళ్ల ముందు నీరు నిలిచి ఉండటంతో ఈనెల 5న 'స్వచ్ఛత కనుమరుగు' శీర్షికన 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. ఎంపీడీవో మల్లేశం, తాళ్లపేట పీహెచ్‌సీ వైద్యుడు క్రాంతి ఆదేశాల మేరకు సర్పంచ్ రాజేశ్వరి, పంచాయతీ కార్యదర్శి సునీత, జీపీ, ఆరోగ్య సిబ్బంది శుక్రవారం గ్రామాన్ని సందర్శించారు. నిల్వనీటిని తొలగించేందుకు, తాత్కాలిక కచ్చ డ్రైన్, ఏర్పాటు చేశారు. బురద ప్రాంతంలో బ్లీచింగ్ చల్లడంతో పాటు, దోమల నివారణ మందు పిచికారీ చేశారు. వైద్య పరీక్షలు నిర్వహించి ఇళ్లచుట్టూ నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని సూచించారు.

భవిత కేంద్రంలో ఫిజియోథెరపీ

లక్సెట్టిపేట: మండల కేంద్రంలోని భవిత కేంద్రంలో దివ్యాంగులైన చిన్నారులకు శుక్రవారం ఫిజియోథెరపీ చేశారు. ప్రతీరోజు ఇంటివద్ద చేసుకునేలా అవగాహన కల్పించారు. భవిత కేంద్రంలో ప్రతి సోమవారం శిబిరం నిర్వహిస్తున్నామని అందుబాటులో ఉన్న వారు వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయురాలు శైలజ, ఫిజియోథెరపిస్టు ప్రియాంక, సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన

జైపూర్: మండలంలోని వేలాలలో శుక్రవారం కుందారం తెలంగాణ గ్రామీణ బ్యాంకు ఆధ్వర్యంలో ఎంపీ.రూరల్ ఫోక్ ఆర్ట్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కళాకారులు ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన, జీవనజ్యోతి బీమా యోజన, అటల్ పెన్షన్ యోజన, నగదు రహిత లావాదేవీలు, సైబర్ మోసాలపై వివరించారు. ఈ కార్యక్రమంలో బ్యాంకు మేనేజర్ సంతోశ్ కుమార్, ఫీల్డ్ ఆఫీసర్ మనోజ్, సర్పంచ్ ప్యాగ శ్యామల, ఉప సర్పంచ్ డేగ నగేశ్, కళాకారులు తేజకుమార్, వేణు, తదితరులు పాల్గొన్నారు.

చీరలు రోడ్డుపై పడేసి మహిళల నిరసన


నిరసన తెలుపుతున్న మహిళలు

బెల్లంపల్లి: బతుకమ్మ చీరలు నాసిరకంగా ఉన్నాయని ఆరోపిస్తూ బెల్లంపల్లి మున్సిపాలిటీ 13వ వార్డుకు చెందిన మహిళలు నిరసన తెలిపారు. శుక్రవారం వార్డు పరిధిలోని గంగారాం నగర్‌లో బతుకమ్మ చీరలు పంపిణీ చేశారు. చీరలు తీసుకునేందుకు వచ్చిన మహిళలు నాసిరకంగా ఉన్నాయని వాటిని రోడ్డుపై పడేశారు. ఎందుకూ పనికిరాని చీరలు ఇస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఆశ వర్కర్ల మానవహారం

మందమర్రిరూరల్: తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఆశ వర్కర్లు శుక్రవారం పట్టణంలోని పాలచెట్టు కూడలి వద్ద మానవహారంగా ఏర్పడ్డారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తుందని మండిపడ్డారు. తమ సమస్యలు పరిష్కరించకుంటే రాష్ట్రస్థాయిలో ఆందోళనలు ఉధృతం చేస్తామన్నారు.

గడప గడపకూ కాంగ్రెస్

రామకృష్ణాపూర్: క్యాతనపల్లి మున్సిపాలిటీ పరిధిలోని శేషుపల్లిలో శుక్రవారం గడపగడపకూ కాంగ్రెస్ కార్యక్రమం నిర్వహించారు. ఇటీవల పార్టీ ప్రవేశపెట్టిన ఆరు గ్యారెంటీ కార్డుల వల్ల ప్రజలకు చేకూరే లబ్ధిని ఇంటింటా వివరించారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి అండగా నిలవాలని కోరారు. పీసీసీ సభ్యుడు నూకల రమేశ్, పీసీసీ ప్రధాన కార్యదర్శి రఘునాథ్‌రెడ్డి, పార్టీ పట్టణ అధ్యక్షుడు రాజు, రాంచందర్, జనార్దన్ పాల్గొన్నారు.

దహన సంస్కారాలు చేసేదెలా...?

- శ్మశాన వాటికల నిర్మాణాల్లో జాప్యం
- వర్షాకాలం గోదావరిలోకి చేరుతున్న వరద నీరు
- రోడ్డు పక్కనే దహన సంస్కారాలు


దహన సంస్కారాలు చేస్తున్న దృశ్యం (ఫైల్)


పాతమంచిర్యాలలో అసంపూర్తిగా శ్మశాన వాటిక

మంచిర్యాలటౌన్: జిల్లా కేంద్రంలో మృతి చెందిన వారికి దహన సంస్కారాలు నిర్వహించేందుకు స్మశాన వాటికలు లేకపోవడంతో ఈ ప్రాంత ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారు. వైకుంఠ ధామాలు లేకపోవడంతో అద్దె ఇళ్లలో నివాసం ఉండే ప్రజలకు మరిన్ని ఇబ్బందులు తప్పడం లేదు. పట్టణానికి నాలుగు వైకుంఠధామాలు మంజూరైనా ఇప్పటికీ ఒక్కటి కూడా వినియోగంలోకి రాలేదు. పాతమంచిర్యాల, ఆండాళమ్మ కాలనీలో మాత్రం స్థలాన్ని సేకరించి, నిర్మాణ పనులు ప్రారంభించగా రాజీవ్‌నగర్, గోదావరి తీరంలో ఇప్పటికీ స్థల సేకరణ జరుగలేదు. గోదావరి నది ప్రాంతంలోనే ఎక్కువ మంది దహన సంస్కారాలు చేస్తుండగా ఈ ప్రాంతంలోనే స్థల సేకరణ విషయంలో ఒక కొలిక్కి రాలేక పోతున్నారు. వర్షాకాలంలో గోదావరి వరద ఉధృతికి నది సమీపంలోకి కూడా వెళ్లలేక రోడ్డు పక్కనే దహన సంస్కారాలు చేస్తున్నారు. జిల్లా కేంద్రానికి చెందిన వ్యాపారి గుండ సుధాకర్ తనకు గోదావరినది ఒడ్డున ఉన్న రెండెకరాల స్థలంలో వైకుంఠధామం నిర్మించారు. కానీ కాళేశ్వరం బ్యాక్ వాటర్‌తో అది మునిగిపోతోంది. వర్షాలు, వరదలు, బ్యాక్ వాటర్ నిల్వ లేని సమయంలో మాత్రమే దీనిని వినియోగించుకునే వీలుంది. ఆయా సమయాల్లో మృతి చెందిన వారిని గోదావరి ఒడ్డుకు తీసుకురావడం ఇబ్బందిగా మారుతోంది. పాత మంచిర్యాల, ఆండాళమ్మ కాలనీలో నిర్మాణాలు సాగుతున్నా అవి నత్తనడకన జరుగుతున్నాయి. వైకుంఠధామాలు పూర్తి చేస్తే అద్దె ఇళ్లల్లో ఉండేవారు మృతదేహాలను ఖననం చేసిన అనంతరం ఇతరత్రా కార్యక్రమాలు అక్కడే జరుపుకునే అవకాశం ఉంది.

నిధులున్నా నిష్ప్రయోజనమే...

జిల్లా కేంద్రంలో 1.50 లక్షలకు పైగా జనాభా ఉన్నారు. సొంత ఇల్లు లేని వారే ఇక్కడ ఎక్కువగా ఉన్నారు. మంచిర్యాల మున్సిపాలిటీ పరిధిలో స్మశాన వాటికల నిర్మాణానికి 2020–21 ఆర్థిక సంవత్సరంలో టీయూఎఫ్ఐడీసీ, ఇతర పథకాల నిధులు రూ.3.40 కోట్లు కేటాయించారు. వాటితో పాత మంచిర్యాల, తిలక్‌నగర్, ఆండాళమ్మ కాలనీ, రాజీవ్‌నగర్, గోదావరి తీర ప్రాంతాల్లో స్మశాన వాటికలు నిర్మించేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. పాతమంచిర్యాల, ఆండాళమ్మ కాలనీల్లో మాత్రమే పనులను ప్రారంభించినా నేటికీ పూర్తి కాలేదు. రాజీవ్‌నగర్, కాలేజీరోడ్డులోని గోదావరి నది ఒడ్డున స్థల సమీకరణకు అడ్డంకులు ఏర్పడుతున్నాయి. స్మశాన వాటికలకు అవసరమైన నిధులున్నా, వాటిని సద్వినియోగం చేసుకోవడంలో మున్సిపల్ పాలకవర్గం, అధికారుల నిర్లక్ష్యం కనిపిస్తోంది. దినదినాభివృద్ధి చెందుతున్న మంచిర్యాలలో స్మశాన వాటికల నిర్మాణం పూర్తి చేయాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

> **త్వరలోనే పూర్తిచేస్తాం**
>
> 
>
> మంచిర్యాల పట్టణంలో నాలుగు స్మశాన వాటికల నిర్మాణానికి గతంలోనే నిధులు కేటాయించాం. పాతమంచిర్యాల, ఆండాళమ్మ కాలనీలో దాదాపుగా నిర్మాణ దశ పూర్తి చేసుకున్నాయి. గోదావరి ఒడ్డున స్థల సేకరణ జరుగుతోంది. రాజీవ్‌నగర్‌లో త్వరలోనే నిర్మాణ పనులను ప్రారంభించి అన్నింటిని పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటాం.
>
> – మారుతి ప్రసాద్, మంచిర్యాల మున్సిపల్ కమిషనర్

కార్మిక కాలనీలకు బీటీరోడ్లు

- ప్రభుత్వ విప్ బాల్క సుమన్


మాట్లాడుతున్న బాల్క సుమన్

మందమర్రిరూరల్: మందమర్రి ఏరియాలోని కార్మిక కాలనీల్లో బీటీ రోడ్లు వేయనున్నట్లు ప్రభుత్వ విప్ బాల్క సుమన్ తెలిపారు. శుక్రవారం ఏరియాలోని రామాలయం వద్ద సింగరేణి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఏరియా జీఎం మనోహర్‌తో కలిసి హాజరయ్యారు. రోడ్డు సౌకర్యం కోసం సింగరేణి సీఎండీ శ్రీధర్‌తో మాట్లాడి రూ.4 కోట్లతో రోడ్డు నిర్మాణ పనులను మంజూరు చేయించినట్లు తెలిపారు. రోడ్డు నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని కాంట్రాక్టర్లకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఏరియా పర్సనల్ మేనేజర్ శ్యాంసుందర్, అధికారులు జయప్రకాశ్, ఆసిఫ్, యూనియన్ల ప్రతినిధులు పాల్గొన్నారు.

అర్ధాకలితో ఇబ్బంది పడొద్దనే అల్పాహారం


అల్పాహారం వడ్డిస్తున్న అదనపు కలెక్టర్

మంచిర్యాలఅర్బన్: విద్యార్థులు అర్ధాకలితో ఇబ్బందులు పడకుండా ప్రభుత్వం మధ్యాహ్న భోజనంతో పాటు అల్పాహారం అందిస్తోందని అదనపు కలెక్టర్ మోతీలాల్ అన్నారు. జిల్లా కేంద్రంలోని న్యూగర్మిళ్ల ప్రైమరీ పాఠశాలలో శుక్రవారం అల్పాహారం పథకాన్ని లాంఛనంగా ప్రారంభించారు. మున్సిపల్ కమిషనర్ మారుతీప్రసాద్, సీడీపీవో విజయలక్ష్మి, సెక్టోరియల్ అధికారి శ్రీనివాస్, ప్రిన్సిపాల్ రాజేశ్, ఎస్ఎంసీ చైర్మన్ ఉషా పాల్గొన్నారు.

పోషకాహార లోపం నివారణకే..

బెల్లంపల్లి: విద్యార్థుల్లో పోషకాహార లోపాన్ని నివారించాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం అల్పాహారం పథకాన్ని ప్రారంభించిందని అదనపు కలెక్టర్ బి.రాహుల్ అన్నారు. బెల్లంపల్లి మున్సిపాలిటీ పరిధి నెంబర్ టూ ఇంక్‌లైన్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అల్పాహార పథకాన్ని ప్రారంభించారు. అనంతరం విద్యార్థులతో కలిసి అల్పాహారం స్వీకరించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ జక్కుల శ్వేత, కమిషనర్ కె.సమ్మయ్య, తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీలకు అవగాహన

మందమర్రిరూరల్: ఆడపిల్లల అక్రమ రవాణా విషయంలో అప్రమత్తంగా ఉండి తగు జాగ్రత్తలు తీసుకోవాలని ప్రజ్వల స్వచ్ఛంద సంస్థ రాష్ట్ర కోఆర్డినేటర్ సురేష్‌కుమార్ సూచించారు. శుక్రవారం ఎంపీడీవో కార్యాలయ ఆవరణలోని సమావేశ మందిరంలో మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అంగన్‌వాడీలకు ప్రొజెక్టర్ ద్వారా అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కోఆర్డినేటర్ శివకుమార్, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు రమాదేవి, సరిత, స్వప్న, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

యువతకు క్రీడా సామగ్రి అందజేత


నెన్నెల: కిట్లు పంపిణీ చేస్తున్న జెడ్పీటీసీ శ్యామల

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలంలోని గఢ్‌పూర్, ర్యాలీ, నాగారం, చిన్నగోపాల్‌పూర్ గామాల్లోని గిరిజన యువతకు శుక్రవారం క్రీడా కిట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచులు లక్ష్మి, రాజు, సోనేరావు, భీంబాయి, ఉప సర్పంచ్‌లు బేర వెంకటేశ్, బుద్దె బానయ్య, కనక మాణిక్‌రావు, పెంద్రం గోపాల్, కార్యదర్శులు రాజేశ్, శ్రీనివాస్, శ్రావణ్, శ్రీనివాస్, వార్డు సభ్యులు, కో ఆప్షన్ సభ్యులు పాల్గొన్నారు.

భీమారం: మండలంలోని బూర్గుపల్లిలో జెడ్పీటీసీ తిరుమల, చెన్నూరు మార్కెట్ కమిటీ డైరెక్టర్ భూక్య రాజ్‌కుమార్ క్రీడాకారులకు క్రీడా సామగ్రి పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ వడ్లకొండ రమాదేవి, పంచాయితీ కార్యదర్శి రాజశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

వేమనపల్లి: మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో యువతకు ఎంపీపీ కోలి స్వర్ణలత ఆధ్వర్యంలో క్రీడా కిట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ వెంకటేశ్, వైస్ ఎంపీపీ గణపతి, ఎంపీటీసీలు చంద్రకళ, కోఆప్షన్ సభ్యుడు జాహెద్ ఆలీ, సర్పంచులు కుబిడె మధుకర్, బాపు, తదితరులు పాల్గొన్నారు.

నెన్నెల: మండలంలోని గుండ్లసోమారంలో జెడ్పీటీసీ శ్యామల మహిళలకు చీరలు, యువతకు క్రీడా కిట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ జాడి శంకర్, నాయకులు సింగతి రాంచందర్, మహిళలు, యువకులు పాల్గొన్నారు.

'ఆర్టీసీ బస్సు పునఃప్రారంభించాలి'


డీఎంకు వినతిపత్రం ఇస్తున్న శ్రీనివాస్

నెన్నెల: నెన్నెల, వేమనపల్లి మండలాల్లోని కోణంపేట, బుయ్యారం, వేమనపల్లి గ్రామాలకు ఆర్టీసీ బస్సును పునఃప్రారంభించాలని బెల్లంపల్లి నియోజకవర్గ స్వతంత్ర అభ్యర్థి రాంటెంకి శ్రీనివాస్ శుక్రవారం ఆర్టీసీ డీఎం రవీంద్రనాథ్‌కు వినతిపత్రం అందజేశారు. మంచిర్యాల డిపో నుంచి ముత్తాపూర్, బుయ్యారం, వేమనపల్లి వరకు బెల్లంపల్లి నుంచి నెన్నెల మీదుగా కోణంపేటకు బస్సు నడిపించాలన్నారు. ఈ మండలాల ప్రజలు బెల్లంపల్లి నియోజకవర్గ కేంద్రానికి రావాలంటే తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆయన వివరించారు. ఆయా గ్రామాల ప్రజల సమస్యలను దృష్టిలో ఉంచుకుని బస్సును వెంటనే పునఃప్రారంభించాలని ఆయన డిమాండ్ చేశారు.

ఆడబిడ్డల ఆత్మగౌరవం కోసమే బతుకమ్మ చీరలు


మందమర్రిరూరల్: పంపిణీ చేస్తున్న విప్ సుమన్


లక్సెట్టిపేట: చీరలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే


మంచిర్యాలటౌన్: పంపిణీ చేస్తున్న రాజయ్య

- ప్రభుత్వ విప్ బాల్క సుమన్
- మహిళలకు చీరలు పంపిణీ

రామకృష్ణాపూర్: తెలంగాణ ఆడబిడ్డల ఆత్మగౌరవం కోసమే రాష్ట్ర ప్రభుత్వం బతుకమ్మ చీరలను పంపిణీ చేస్తోందని ప్రభుత్వ విప్, చెన్నూర్ ఎమ్మెల్యే బాల్క సుమన్ అన్నారు. క్యాతనపల్లి మున్సిపల్ కార్యాలయంలో మహిళలకు బతుకమ్మ చీరలు పంపిణీ చేశారు. మున్సిపల్ చైర్‌పర్సన్ జంగం కళ, కమిషనర్ వెంకటనారాయణ, తహసీల్దార్ చంద్రశేఖర్, మున్సిపల్ వైస్ చైర్మన్ సాగర్‌రెడ్డి, బీఆర్ఎస్ పట్టణ ఇన్‌చార్జి గాండ్ల సమ్మయ్య, తదితరులు పాల్గొన్నారు.

సద్దుల బతుకమ్మ పండుగను ఘనంగా జరుపుకోవాలి

లక్సెట్టిపేట: సద్దుల బతుకమ్మను మహిళలు ఘనంగా జరుపుకోవాలని ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్ రావు అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని మున్సిపల్ కార్యాలయ ఆవరణలో మహిళలకు చీరలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళల కోసం తెలంగాణ ప్రభుత్వం ప్రత్యేక పథకాలు ప్రవేశపెట్టిందన్నారు. అనంతరం యువతకు క్రికెట్ కిట్‌లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డీసీఎంఎస్ చైర్మన్ తిప్పని లింగన్న, మున్సిపల్ చైర్మన్ నల్మాసు కాంతయ్య, వైస్ చైర్మన్ పొడేటి శ్రీనివాస్‌గౌడ్, పట్టణ అధ్యక్షుడు పాదం శ్రీనివాస్, తహసీల్దార్ రాఘవేంద్రరావు, కమిషనర్ రాజశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

భీమారం: మండల కేంద్రంలో మహిళలకు చీరలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు చెరుకు సరోత్తంరెడ్డి, తహసీల్దార్ విశ్వంభర్, సర్పంచ్ రాంరెడ్డి పాల్గొన్నారు.

కోటపల్లి: దసరా కానుకగా ప్రభుత్వం మహిళలకు బతుకమ్మ చీరలు పంపిణీ చేస్తోందని ఎంపీపీ మంత్రి సురేఖ అన్నారు. కోటపల్లి, సర్వాయిపేట, తదితర గ్రామాల్లో బతుకమ్మ చీరలతో పాటు యువతకు క్రీడాసామగ్రి పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆర్ఐ రాజలింగు, జూనియర్ అసిస్టెంట్ తిరుపతి, నాయకులు ప్రభాకర్, రాగం స్వామి, రాఘవేందర్, సుందర్, సుధాకర్, రామయ్య పాల్గొన్నారు.

భీమిని: మండలంలోని లక్ష్మీపూర్, భీమిని గ్రామాల్లో బతుకమ్మ చీరలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ పోతురాజుల రాజేశ్వరి, జెడ్పీటీసీ పోతురాజుల గంగక్క, సర్పంచ్ కమలాబాయి, ఉప సర్పంచ్ ఓంప్రకాష్‌గుప్తా, తహసీల్దార్ బికర్ణదాస్, తదితరులు పాల్గొన్నారు.

వేమనపల్లి: మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో తహసీల్దార్ సదానందం, ఎంపీపీ కోలి స్వర్ణలత ఆధ్వర్యంలో చీరలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కుబిడె మధుకర్, ఆర్ఐ లక్ష్మణ్, డీటీ సంతోష్, ఎంపీటీసీ చంద్రకళ, తదితరులు పాల్గొన్నారు.

మంచిర్యాలటౌన్: జిల్లా కేంద్రంలోని 8వ వార్డు పాతమంచిర్యాలలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పెంట రాజయ్య మహిళలకు చీరలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో డీసీసీబీ డైరెక్టర్ ఎర్రం తిరుపతి, మాజీ కౌన్సిలర్లు బొలిశెట్టి కిషన్, పల్ల రాజన్న, నాయకులు తూముల వెంకటరామయ్య, నడిపెల్లి వెంకటేశ్వర్‌రావు, విశ్వనాథ ఆలయ డైరెక్టర్ వడ్నాల రవీందర్, వార్డు అధ్యక్షుడు వేముల గురువయ్య, పెంట తిరుపతి, శెట్టి శ్రీనివాస్, పెంట ప్రదీప్, ధరణి శ్రీనివాస్, తూముల ప్రభాకర్, రమేశ్ యాదవ్ పాల్గొన్నారు.

మందమర్రిరూరల్: మండల కేంద్రంలోని సమ్మక్క, సారలమ్మ మహిళా భవనంలో ప్రభుత్వ విప్ బాల్క సుమన్ మహిళలకు బతుకమ్మ చీరలు, యువకులకు క్రీడా సామగ్రి పంపిణీ చేశారు.

దండేపల్లి: మండలంలోని కొండాపూర్, కొత్తమామిడిపల్లి, లక్ష్మీకాంతపూర్, గూడెం గ్రామాల్లో వెద్రబెల్లి ఫౌండేషన్ ఆధ్వర్యంలో వెద్రబెల్లి స్రవంతి మహిళలకు చీరలు పంపిణీ చేశారు.

'ఆత్మగౌరవసభ విజయవంతం చేయాలి'


పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

పాతమంచిర్యాల: హైదరాబాద్‌లోని పరేడ్ గ్రౌండ్‌లో ఈ నెల 8న నిర్వహించనున్న ముదిరాజ్‌ల ఆత్మగౌరవ సభను విజయవంతం చేయాలని సంఘం జిల్లా అధ్యక్షుడు తూటి శ్రీనివాస్ కోరారు. జిల్లా కేంద్రంలోని ఐబీ గెస్ట్‌హౌస్‌లో శుక్రవారం ఇందుకు సంబంధించిన పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజ్యాధికార హక్కును సాధించుకునే దిశగా ముదిరాజ్‌లు పార్టీల కతీతంగా పోరాడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పిల్లి రవి, పట్టణ అధ్యక్షుడు శాతం మల్లేశ్, కార్యదర్శి సందనవేణి ప్రవీణ్, గౌరవ అధ్యక్షుడు చొప్పరి సారంగపాణి, జిల్లా మహిళా అధ్యక్షురాలు కనుకుట్ల తిరుమల, పట్టణ అధ్యక్షురాలు తూటి సరస్వతి, నాయకులు కంకణాల సతీష్, అనవేన రాయమల్లు, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలి

తాండూర్: విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలని ఎంఈవో వాసాల ప్రభాకర్ అన్నారు. శుక్రవారం మండలంలోని కేజీబీవీని సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు నిర్వహిస్తున్న పరీక్షలను పరిశీలించారు. విద్యార్థులు పరీక్షల్లో ఉన్నతంగా రాణించాలని సూచించారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి నాణ్యమైన, రుచికరమైన భోజనం అందించాలని సూచించారు. ప్రిన్సిపాల్ సుమన, క్లస్టర్ రిసోర్స్ పర్సన్ నాగరాజు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

'మధ్యాహ్న' కార్మికుల రాస్తారోకో


రాస్తారోకో చేస్తున్న కార్మికులు

నెన్నెల: తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మధ్యాహ్న భోజన కార్మికులు శుక్రవారం మండల కేంద్రంలోని రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. పెండింగ్ బిల్లులు చెల్లించాలని, కనీస వేతనం రూ.26 వేలు నిర్ణయించాలని పది రోజులుగా సమ్మె చేస్తున్నా ప్రభుత్వం స్పందించడం లేదన్నారు. వారికి కాంగ్రెస్ నాయకులు మద్దతు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీటీసీ శిరీష, కాంగ్రెస్ నాయకులు గట్టు బానేష్, గోవింద్‌సింగ్, కొమ్ము రాజం, దరావత్ రవి, బాపురెడ్డి, కార్మికులు రామక్క, సులోచన, పద్మ, సీతక్క, గౌరక్క, తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న సమ్మె

చెన్నూర్: తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో మధ్యాహ్న భోజన కార్మికులు చేపట్టిన సమ్మె కొనసాగుతోంది. శుక్రవారం చెన్నూర్‌లో కార్మికులు చేస్తున్న సమ్మెకు సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ప్రకాశ్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి అశోక్, సంకె రవి, చందు మద్దతు తెలిపారు.

సంక్షిప్త వార్తలు

'మంత్రి పర్యటన విజయవంతం చేయాలి'

చెన్నూర్‌రూరల్: చెన్నూర్ పట్టణంలో మంత్రి హరీష్‌రావు పర్యటనను విజయవంతం చేయాలని ఎంపీపీ మంత్రి బాపు, జెడ్పీటీసీ మోతె తిరుపతి, మార్కెట్ కమిటీ చైర్మన్ మల్లెల దామోదర్‌రెడ్డి కోరారు. శనివారం చెన్నూర్‌లో పలు అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవం, శంకుస్థాపనలు చేయనున్నట్లు వారు పేర్కొన్నారు.

రుణ లక్ష్యాలు పూర్తిచేయాలి

దండేపల్లి: ఎస్ఎస్‌జీల బ్యాంకు లింకేజీ, స్త్రీనిధి రుణ లక్ష్యాన్ని గడువులోగా పూర్తి చేయాలని డీఆర్‌డీవో శేషాద్రి సూచించారు. స్థానిక శ్రీలక్ష్మి మండల సమాఖ్య కార్యాలయంలో శుక్రవారం వీవోఏల సమీక్షా సమావేశం నిర్వహించారు. ఏపీడీలు స్వర్ణలత, రమేశ్, ఏపీఎం బ్రహ్మయ్య, టీజీబీ మేనేజర్ అనిల్, ఫీల్డ్ ఆఫీసర్ చంద్రకాంత్ పాల్గొన్నారు.

'సెల్‌టవర్ నిర్మాణం ఆపాలి'

బెల్లంపల్లి: బెల్లంపల్లి మున్సిపాలిటీ పరిధిలోని షంషీర్‌నగర్ బస్తీలో జననివాసాల మధ్య నిర్మిస్తున్న సెల్‌టవర్ నిర్మాణం వెంటనే ఆపాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం బస్తీవాసులు డెప్యూటీ తహసీల్దార్ ప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

జన్నారం: ఎలక్ట్రానిక్ మీడియా మండల కార్యవర్గాన్ని శుక్రవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కందుల రమేశ్, ప్రధాన కార్యదర్శిగా నిజామొద్దీన్, ఉపాధ్యక్షుడిగా కొండపెల్లి ప్రశాంత్, కోశాధికారిగా ఎర్రం తిరుపతి, సంయుక్త కార్యదర్శులుగా శ్రీనివాస్, రాజేశ్, ప్రచార కార్యదర్శిగా అజ్మత్ షరీఫ్, సభ్యులుగా సంతోష్, మహేశ్, మహేందర్, సలహాదారులుగా శ్రీనివాస్‌ను ఎన్నుకున్నారు.

ఎన్ఎస్‌యూఐ మండల అధ్యక్షుడిగా సాయినాయక్

జన్నారం: ఎన్ఎస్‌యూఐ మండల అధ్యక్షుడిగా సాయినాయక్, పట్టణ అధ్యక్షుడిగా రాజ్‌కుమార్‌ను ఎన్నుకున్నట్లు రాష్ట్ర కార్యదర్శి సోహెల్ తెలిపారు. కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి గుర్రం మోహన్ రెడ్డి, మాజీ అధ్యక్షుడు ప్రభుదాస్, ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు నందునాయక్ అభినందించారు.

కోరం లేక మండల సమావేశం వాయిదా

బెల్లంపల్లిరూరల్: మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సర్వసభ్య సమావేశానికి ఎంపీపీ శ్రీనివాస్‌తో పాటు సభ్యులు గైర్హాజరయ్యారు. మెజార్టీ సభ్యులు సమావేశానికి హాజరు కాకపోవడంతో కోరం లేక సమావేశాన్ని వాయిదా వేసినట్లు ఎంపీడీవో రాజేందర్ ప్రకటించారు.

'కిష్టంపేట సమస్యలు పరిష్కరించాలి'

తాండూర్: మండలంలోని కిష్టంపేట గ్రామ పంచాయతీలో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం బీజేపీ మండల అధ్యక్షుడు రామగొని మహీధర్ గౌడ్ ఆధ్వర్యంలో నాయకులు గ్రామంలో పర్యటించి గ్రామస్తులను అడిగి సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి చిలుముల శ్రీకృష్ణదేవరాయలు, ఎస్సీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి పాగిడి చిరంజీవి, బీజేవైఎం జిల్లా ప్రధాన కార్యదర్శి ఏముర్ల ప్రదీప్, బీజేపీ మండల ఉపాధ్యక్షుడు కోమండ్ల శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి విష్ణుకళ్యాణ్, నాయకులు భాస్కర్‌గౌడ్ పాల్గొన్నారు.

నానో యూరియాపై అవగాహన

దండేపల్లి: మండలంలోని కర్ణపేట రైతు వేదికలో శుక్రవారం ద్రవరూప నానోయూరియా వాడకంపై ఏఈవో రజిత అవగాహన కల్పించారు. ద్రవరూప యూరియా బాటిల్ 500 ఎంఎల్ ఉంటుందని, ఇది ఒక్క బస్తా యూరియాతో సమానమన్నారు.

వన్యప్రాణుల సంరక్షణపై అవగాహన

చెన్నూర్‌రూరల్: వన్యప్రాణి వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం సోమనపల్లి సమీపంలోని ఎల్‌మడుగు, శివ్వారం అటవీ ప్రాంతంలో అధికారులు వన్యప్రాణుల సంరక్షణపై కళాశాల విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో చెన్నూర్, కోటపల్లి, నీల్వాయి ఎఫ్ఆర్‌వోలు శివకుమార్, రవి, ఇక్బాల్‌హుస్సేన్, సెక్షన్ అధికారి బాలకృష్ణ, శివ్వారం సర్పంచ్ గణేశ్, సిబ్బంది పాల్గొన్నారు.

'అవినీతికి పాల్పడలేదని రుజువు చేస్తారా?'

మంచిర్యాలటౌన్: ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు అవినీతికి పాల్పడలేదని ఆయన పూజించే సాయిబాబా గుడిలో ప్రమాణం చేస్తే తాను రాజకీయాల నుంచి తప్పుకుంటానని మున్సిపల్ ఫ్లోర్‌లీడర్ రావుల ఉప్పలయ్య సవాల్ విసిరారు. మాజీ ఎమ్మెల్సీ కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు నివాసంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అభివృద్ధి పనుల్లో కమీషన్లు, ఏసీసీ పక్కన ప్రభుత్వ భూమి తన తండ్రి పేరిట రెవెన్యూ రికార్డుల్లో నమోదు చేయడం వంటి చర్యలకు పాల్పడలేదా అని ప్రశ్నించారు. ఉప నాయకుడు మాజీద్, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు, కౌన్సిలర్ రామగిరి బానేశ్, మహిళా కాంగ్రెస్ పట్టణ అధ్యక్షురాలు హేమలత పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన

జన్నారం: మండలంలోని పలు పోలింగ్ కేంద్రాలను శుక్రవారం తహసీల్దార్ వనజారెడ్డి సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆగస్టు 19 నాటికి 40,442 మంది ఓటర్లు ఉండగా 2,078 మంది పెరిగారన్నారు.